

శిలాఫలకం మారింది..!



తొలుత ఎమ్మెల్యే ఫొటోతో ఏర్పాటుచేసిన తురకలాపట్నం సచివాలయ శిలాఫలకం

పెనుకొండ వైసీపీలో విభేదాలు మరింత ముదురుతున్నాయి. పార్టీ అధిష్ఠానం ఇటీవల మార్పుచేర్పుల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే శంకర్ నారాయణను కాదని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. మంత్రి వచ్చాక.. ఎమ్మెల్యే ఊసేలేకుండా చేస్తున్నారన్న అసంతృప్తి ఆయన వర్గీయుల్లో ఉంది. దీంతో వారు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రొద్దం మండలం తురకలాపట్నం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) ప్రారంభోత్సవం అందుకు మరింత ఆజ్యం పోసింది. ప్రారంభోత్సవ శిలాఫలకాలపై గతంలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఫొటో, పేరు ప్రముఖంగా ముద్రించారు. గురువారం శిలాఫలకాలను మంత్రి ఉషశ్రీచరణ్ ఆవిష్కరించాల్సి ఉండడంతో ఉన్నఫలంగా వాటిని మార్చేశారు. బుధవారమే ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న శిలాఫలకాలను మార్చేసి.. కొత్తగా మంత్రి ఫొటో, పేరు ప్రముఖంగా ఉన్న వాటిని ఏర్పాటు చేశారు. అంతేకాదు, ఎమ్మెల్యే వర్గానికి చెందిన వారి పేర్లను తొలగించారు. దీంతో వారు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు.

-రొద్దం



మంత్రి ఫొటోతో తాజాగా ఏర్పాటు చేసిన శిలాఫలకం

చెరువులో తోడేలు..!

వైసీపీ నాయకుడి ఇష్టారాజ్యం
అనుమతులు లేకుండా మట్టి తరలింపు
పట్టించుకోని అధికారులు



మడకశిర రూరల్, ఫిబ్రవరి 15: అధికారం ఉంది కదా అని వైసీపీ నాయకుడు తోడేలు అవతారమెత్తాడు. అనుమతులు లేకుండానే చెరువులో యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో మట్టి తవ్వకాలకు ఉపక్రమించాడు. మండలంలోని సీ కొడిగేపల్లి చెరువులో గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గురువారం ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు చేపట్టాడు. మూడు ట్రాక్టర్ల ద్వారా రవాణా చేశాడు. అనుమతులు కూడా తీసుకోకుండా యథేచ్ఛగా చెరువు మట్టిని తరలించాడు. దీనిపై అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించినా అటువైపు కన్నెత్తిచూడకపోవడం శోచనీయం. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులను అడగ్గా.. చెరువులో మట్టి తరలింపునకు ఎవరికీ అనుమతులివ్వలేదని చెప్పుకొచ్చారు. అలాంటపుడు సమాచారం అందినా తవ్వకాలను ఎందుకు అడ్డుకోవట్లేదన్న ప్రశ్నకు వారే సమాధానం చెప్పాలి.



చెరువులో మట్టిని తవ్వి, తరలిస్తున్న దృశ్యాలు

పోలీసు స్టేషనా... వైసీపీ కార్యాలయమా?



ధర్మవరం టూటౌన్ పోలీసు స్టేషన్ ప్రహరీ వద్ద ఏర్పాటు చేసిన సిద్ధం ఫ్లెక్సీలు



ఈ ఫొటోలో వైసీపీ సిద్ధం ఫ్లెక్సీలను చూస్తుంటే ఇది పార్టీ కార్యాలయంలా ఉందని ఎవరైనా భావిస్తారు. అలా అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది వైసీపీ కార్యాలయం కానే కాదు, ధర్మవరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్. అయితేనేం వైసీపీ నాయకులకు అవేవీ పట్టవు. ఇదివరకు సచివాలయాల ముందు వైసీపీ జెండాలు ఎగురవేయడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, రంగులు వేసుకోవడం చూశాం. ఇప్పుడు ఏకంగా పోలీసు స్టేషన్ గేటు పక్కనే సిద్ధం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేశారు. వాటిని చూసిన జనం ఇది పోలీసు స్టేషనా.. వైసీపీ కార్యాలయమా అంటూ నివ్వెరపోతున్నారు. ఫ్లెక్సీల ఏర్పాటును అడ్డుకుంటే ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని పోలీసులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

-ధర్మవరంరూరల్

బ్రహ్మరథం

నారా భువనేశ్వరికి అడుగడుగునా ఘనస్వాగతం
జనసంద్రం నడుమ మూడోరోజు పర్యటన





నారా భువనేశ్వరికి బొకే ఇచ్చి స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి



స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న



విజయ సంకేతం చూపుతున్న నారా భువనేశ్వరి



హాజరైన జనసందోహం

హిందూపురం/మడకశిర టౌన్/రూరల్, ఫిబ్రవరి 15: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరికి జిల్లాలో జనం బ్రహ్మరథం పట్టారు. పర్యటన మూడోరోజు గురువారం కూడా జనసంద్రం నడుమ సాగింది. అడుగడుగునా టీడీపీ శ్రేణులు, జనం ఘనస్వాగతం పలికారు. ఊరూరా మహిళలు హారతులిచ్చారు. చప్పట్లతో స్వాగతించారు. కేరింతలతో అభిమానం చాటుకున్నారు. ఆమె పర్యటించిన ప్రతిచోటా జనం భారీగా తరలివచ్చారు. అందరికీ అభివాదం చేస్తూ నారా భువనేశ్వరి ముందుకు కదిలారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి మూడు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్నారు. చివరిరోజు హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పర్యటించారు. హిందూపురంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి స్వాగతం పలికారు. భువనేశ్వరిని చూడటానికి మహిళలు ఎగబడ్డారు. పోటీపడి ఆమెతో కరచాలనం చేశారు.



అభిమానానికి వందనం



నారా భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు మడకశిరలో వేచివున్న టీడీపీ నేతలు, మహిళలు



నారా భువనేశ్వరి పర్యటనకు హాజరైన జనం

మడకశిరలో టీడీపీ శ్రేణులు పూలవర్షం కురిపించారు. పూలమాలలు, బొకేలతో ఘన స్వాగతం పలికారు. మడకశిర పట్టణం జనసంద్రంగా మారింది. నారా భువనేశ్వరి రాకకోసం ఉదయం 10 గంటల నుంచి టీడీపీ శ్రేణులు, జనం ఎదురుచూశారు. 12 గంటలకు నారా భువనేశ్వరి మడకశిరకు చేరుకోగానే నినాదాలతో హోరెత్తించారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి, అభిమానం చాటుకున్నారు. మడకశిర మండలంలోని కల్లుమర్రి, అగ్రంపల్లి, బుళ్ళసముద్రం గ్రామాల ప్రజలు నీరాజనం పలికారు. కల్లుమర్రి వద్ద నారా భువనేశ్వరికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పుష్పగుచ్ఛం ఇచ్చి, స్వాగతం పలికారు. అగ్రంపల్లి వద్ద మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఘనంగా స్వాగతం పాలికారు.

పరిహాసం..!

ఖరీఫ్‌లో జిల్లా అంతటా పంటనష్టం

- వర్షాభావంతో ఎండిన పంటలు
- గ్రాసం కూడా దక్కని దుస్థితి
- కేంద్ర కరువు బృందం పరిశీలన
- పరిహారం ఊసెత్తని పాలకులు
- అన్నదాతకు తప్పని నిరీక్షణ



ఆంధ్రజ్యోతి పుట్టపర్తి

జిల్లా రైతుకు ఏటా పంట నష్టం తప్పట్లేదు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతింటూనే ఉన్నాయి. గత ఖరీఫ్‌లో పరిస్థితి మరీ దారుణం. తీవ్ర వర్షాభావంతో పంటలు నిలువునా ఎండిపోయాయి. చాలాచోట్ల పశుగ్రాసం కూడా దక్కలేదు. దీంతో అన్నదాత సర్వం నష్టపోయాడు. పెట్టుబడులు, కూలీల ఖర్చులు అన్నీ మట్టిలోకి పోయాయి. పంటనష్టపరిహారం అందించి, ఆదుకుంటామని పాలకులు చెబుతున్నారు. ఆ సొమ్ము అయినా అందితే కాస్త ఉపశమనం పొందుదామని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. జిల్లా యంత్రాంగం పంట నష్టంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపింది. కేంద్ర కరువు బృందం సైతం జిల్లాలో పర్యటించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించింది. పంట నష్టంపై కేంద్రానికి నివేదిక కూడా పంపింది. రెండు నెలలైనా పరిహారం సొమ్ము మాత్రం రైతుకు అందలేదు. పాలకులు ఆ ఊసే ఎత్తట్లేదు. దీంతో అన్నదాతల్లో అయోమయం నెలకొంది. రైతు ప్రభుత్వమని చెప్పుకునే వైసీపీ పాలకులు పరిహారం పంపిణీలో ఎందుకు జాప్యం చేస్తున్నారన్న విమర్శలు తలెత్తుతున్నాయి.


ఖరీఫ్ రైతు కష్టమంతా తీవ్ర వర్షాభావం దెబ్బకు పంటలు రైతన్న చేతికి రాకపోగా అప్పుల ఊబిలోకి నెట్టింది. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి వెంటాడుతూ రైతన్నను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. వర్షాభావం ఖరీఫ్‌ను దెబ్బతీస్తే.. రబీ సాగు ముందుకు సాగలేదు. చేలు బీళ్లుగా మిగిలిపోయాయి. ఈ పరిణామాలు జిల్లాలో వ్యవసాయంపై ఆధారపడిన రైతన్నను ఆందోళనలోకి నెట్టేశాయి. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందించి, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం అంటూ సీఎం జగన్ ఆర్భాటపు ప్రకటనలు చేశారు. రబీ సీజన్ పంట ముగింపు దశకు వచ్చినా నేటికీ ఖరీఫ్‌కు పంట నష్టానికి సంబంధించిన పరిహారం అందక అన్నదాతలు నిరీక్షించాల్సి వస్తోంది. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే అనే మాటకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనలేకుండా పోతోంది. పంటనష్టపరిహారం కోసం అన్నదాతకు ఎదురుచూపులు తప్పట్లేదు. ఖరీఫ్‌లో పంట నష్టంపై గతేడాది డిసెంబరులో కేంద్ర కరువు అధ్యయన బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించి రెండు నెలలైనా పరిహారం సొమ్ము రైతుల ఖాతాల్లోకి జమకాలేదు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ముంచుకొస్తున్న తరుణంలో రైతన్నల్లో ఖరీఫ్ పంటనష్టపరిహారం అందేదెన్నడు అన్న ఆందోళన నెలకొంది.



జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర కరువు బృందం (ఫైల్)

వెంటాడుతున్న కరువు

జిల్లాలో ఏటా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.23 లక్షల హెక్టార్లు. గత ఖరీఫ్ ప్రారంభం నుంచే వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటల సాగు ముందుకు సాగలేదు. అన్ని పంటలు కలిపి 114076 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. అరకొర పదునులో అప్పోసప్పో చేసి, పెట్టుబడులు పెట్టి రైతన్న విత్తనం సాగు చేశాడు. తీరా పంటచేతికొచ్చే సమయానికి వరుణ దేవుడు కరుణించలేదు. ఫలితంగా పంటలు ఎండిపోయి పొలంలోనే వదిలేసే పరిస్థితులు దాపురించాయి. కూలీల ఖర్చులు కూడా దక్కలేదు. జిల్లాలో 32 మండలాల్లో ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగుచేసిన పంటలు 90శాతంపైగా చేతికి దక్కకపోగా.. 117005 ఎకరాల్లో రైతన్న పంటలు నష్టపోయినట్లు జిల్లా యంత్రాంగం.. ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఇలా వేరుశనగ, కంది, మొక్కజొన్న, పత్తితోపాటు వర్షాధారంగా సాగు చేసిన పంటలు దెబ్బతిని జిల్లా రైతులకు రూ.500 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు యంత్రాంగం అంచనా వేసినట్లు తెలుస్తోంది. జిల్లా అంతటా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం మాత్రం ఏడు మండలాల్లోనే తీవ్ర కరువు ఉన్నట్లు ప్రకటించింది. 14 మండలాల్లో మధ్యస్థ కరువు ఉన్నట్లు పేర్కొంది. 11 మండలాలకు మొండిచేయి చూపింది. రెండేళ్లుగా రైతన్నను కరువు వెంటాడుతూ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపినా.. కరువు మండలాల ప్రకటనలో అన్యాయం చేశారంటూ అన్నదాతలు వాపోతున్నారు.



సర్కారు సాయం కోసం నిరీక్షణ

ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో పంటలన్నీ ఎండిపోయాయి. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలనకు డిసెంబరు 13న కేంద్ర కరువు బృందం జిల్లాలో పరిగి, మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించింది. వేరుశనగ, కంది, రాగి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు జిల్లా అంతటా 73556 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు కేంద్రానికి నివేదిక పంపారు. అత్యధికంగా వేరుశనగ, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదించారు. అప్పట్లో పంటలు వేసి నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇస్తామని వెల్లడించారు. ఎకరాకు ఎంత ఇస్తారనేది చెప్పకున్నా.. కేంద్ర కరువు బృందం నివేదికతో ప్రభుత్వం తమను ఆదుకుంటుందన్న ఆశ రైతన్నల్లో నెలకొంది. పంట నష్టానికి సంబంధించి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం ఇచ్చి మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం అంటూ రైతు సదస్సుల్లో సీఎం జగన్ గొప్పలు చెబుతుంటారు. కేంద్ర కరువు బృందం నివేదించి రెండు నెలలైనా రైతుల ఖాతాల్లోకి పంటనష్ట పరిహారం సొమ్ము మాత్రం జమకాలేదు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

ఖరీఫ్‌లో పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదికలు పంపాం. గత డిసెంబరులో కేంద్ర కరువు బృందం కూడా పర్యటించి, కేంద్రానికి పంట నష్టం నివేదికలు పంపింది. నిధులు విడుదలైన వెంటనే రైతుల ఖాతాల్లోకి జమవుతాయి. పంట నష్టపోయిన ప్రతి రైతుకు సాయం అందుతుంది.

- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

గ్రామసేవే రామసేవ

ఆర్‌జే రత్నాకర్
వాటర్ ప్లాంట్‌కు శ్రీకారం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 15: గ్రామసేవే రామసేవ అని సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని పొడరాళ్ళపల్లిలో ఏర్పాటు చేసిన శుద్ధి నీటి ప్లాంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అందరూ సమష్టిగా పనిచేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. 25 ఏళ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో 1600 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నామన్నారు. విద్యనే అభివృద్ధికి మూలాధారమని, పిల్లలను చదివిస్తే భావితరాలు బాగుంటాయని సూచించారు. ప్రతి గ్రామంలో భజన మండలి ఏర్పాటు చేసుకుని, భజనలు, భక్తి కార్యక్రమాలు చేస్తే మనసు ప్రశాంతంగా ఉండడంతోపాటు ఊళ్లతో గొడవలు లేకుండా పోతాయని రత్నాకర్ సూచించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, విదేశీయులు, సత్యసాయి సేవకులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి ఉత్సవం

కదిరి, ఫిబ్రవరి 15: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలనుంచి స్వామివారు సూర్యప్రభవాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్జేడీ

బుక్కపట్నం, ఫిబ్రవరి 15: పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ ఆర్జేడీ రాఘవరెడ్డి ఆదేశించారు. స్థానిక డైట్ కళాశాలలో గురువారం జిల్లా పరిధిలోని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు, డైట్ సిబ్బంది, కేజీబీవీ ఎస్‌లతో పది పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. జిల్లాలో 10 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆర్జేడీని డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, కళాశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి



పాఠాలు చెప్పాల్సిందే..!

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
ఎంఈఓలు, హెచ్ఎంలకు ఆర్జేడీ హెచ్చరిక



మాట్లాడుతున్న ఆర్జేడీ రాఘవరెడ్డి



హాజరైన ఎంఈఓలు, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15: పిల్లలకు చదువు చెప్పే విషయంలో రాజీ పడేదే లేదని, నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించేది లేదని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ రాఘవరెడ్డి అన్నారు. ఆర్ట్స్ కాలేజీలో జిల్లాలోని ఎంఈఓలు, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. వారిని సూటిగా ప్రశ్నలు అడుగుతూ ఆశ్చర్యానికి గురి చేశారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) 2020 గురించి ఎంతమంది చదివారని ప్రశ్నించారు. కనీసం వార్తా ప్రతికలు, సామాజిక మాధ్యమాల్లోనైనా చూశారా..? ఒక్క పేజీ అయినా చదివారా..? అని అడిగారు. 'మీరు చదువు చెప్పే స్కూళ్లలో మీ పిల్లలను ఎందుకు చదివించడం లేదు?' అని ప్రశ్నించారు. నాడు-నేడులో భాగంగా స్కూళ్లను ప్రభుత్వం ఎందుకు అభివృద్ధి చేస్తోంది..? ఎంత మంది ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా బోధన చేస్తున్నారు..? అని ప్రశ్నలు వేస్తూ ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎన్ఈపీ ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతోందని అన్నారు. ఎంఈఓలు, హెచ్ఎంలు ఉపాధ్యాయులు కాదని, నాయకుల వంటివారని అన్నారు. నిజ జీవితంలో ఉపయోగపడేలా చదువులు ఉండాలని అన్నారు. 'మన తల్లిదండ్రులు చాలామంది చింత చెట్ల కింద, ఇసుకలో రాసి చదువుకున్నారు. అయినా అనర్గళంగా ఇంగ్లీష్ సైతం మాట్లాడేవారు..' అని గుర్తు చేశారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. పాఠాలు చెప్పే విషయంలో, లెసన్ ప్లాన్ తయారీలో నిర్లక్ష్యంగా ఉన్న పక్క జిల్లాలోని ఓ టీచర్ ఇంక్రిమెంట్ కోత పెట్టానని తెలిపారు. పాఠాలు బాగా చెప్పలేదని, అరగంట ఆలస్యంగా బడికి వెళ్లాడన్న కారణంగా ఒకనాటి తన విద్యార్థులైన ఉపాధ్యాయులపైనే సస్పెన్షన్, జీతంలో కోత వంటి చర్యలు తీసుకున్నానని వివరించారు. 'తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే' అని హెచ్చరించారు. 'నేను పనిచేస్తున్న పాఠశాలలో నా పిల్లలను ఎందుకు చదివించడం లేదు?' అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కుంటే.. మీరు గుడ్ లీడర్స్‌గా తయారవుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం కలెక్టర్ వంటి వారే గేటు వద్ద వెయిట్ చేసేలా తీర్చిదిద్దాలన్నారు. 1960, 70లో ఇలాంటి సంఘటనలు జరిగాయని అన్నారు. అంతకుముందు ఏసీ గోవింద్ నాయక్, ఏడీ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, శ్రీదేవి 10వ తగతి పరీక్షలపై సూచనలు సలహాలు ఇచ్చారు.

టీచర్లపై కేసులు ఎత్తేయండి

సమీక్ష అనంతరం హెచ్ఎంలు, ఎంఈఓలకు ఆర్జేడీ మాట్లాడే అవకాశం ఇచ్చారు. దీంతో టీచర్లపై ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని హెచ్ఎం నరసింహులు కోరారు. ఉద్యమంలో భాగంగా ఆందోళన చేసినప్పుడు టీచర్లపై కేసులు పెట్టారని, మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామని అన్నారు. ప్రమోషన్ల సమస్య కూడా కోర్టులో నానుతోందని అన్నారు. కేసు పరిష్కారమైతే సుమారు 250 మందికి ఉద్యోగోన్నతులు వస్తాయని అన్నారు. స్కూళ్లకు వేలకు వేలు కరెంటు బిల్లులు వస్తున్నాయని, కట్టవద్దని మంత్రి సూచించారని అన్నారు. బిల్లులు కట్టనందుకు విద్యుత్ కనెక్షన్‌లను తొలగిస్తున్నారని వివరించారు. తాను ప్రతి నెలా రూ.6 వేలు కడుతున్నానని, మరికొందరు హెచ్ఎంలు రూ.12 వేలకు పైగా భరిస్తున్నారని అన్నారు. స్కూళ్ల గ్రాంటు విడుదల చేయాలని కోరారు. నాడు-నేడు పనులు మంచి దశలో ఉన్నాయని, 3వ విడత రివాల్వింగ్ ఫండ్ రావడం లేదని ఓ ఎంఈఓ అన్నారు. వీటికి ఆర్జేడీ తల ఊపడం మినహా సమాధానం ఇవ్వలేదు.



ఆర్జేడీ వద్ద సమస్యలు ఏకరవు పెడుతున్న హెచ్ఎం నరసింహులు



దిన్నెహట్టికి చెందిన కార్యకర్త ముత్తప్ప కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి



దిన్నెహట్టికి తరలివచ్చిన కార్యకర్తలు నాయకులు

కార్యకర్తలను కాపాడుకుంటాం

కంటికి రెప్పలా చూసుకుంటాం
పురానికి నారా, నందమూరి కుటుంబాలు అండగా ఉంటాయి : నారా భువనేశ్వరి
మూడోరోజు కొనసాగిన నిజం గెలవాలి యాత్ర
మృతుల కుటుంబాలకు పరామర్శ
ఆర్థికసాయం చెక్కుల పంపిణీ

హిందూపురం/మడకశిర, ఫిబ్రవరి 15: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి శ్రీసత్యసాయి జిల్లాలో మూడోరోజు గురువారం పర్యటన కొనసాగించారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన టీడీపీ కార్యకర్త అంజినప్ప.. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించడంతో ఆ కుటుంబానికి నారా భువనేశ్వరి వెళ్లారు. అంజినప్ప చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.3 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బయటకు వచ్చి మేడ పైకి వెళ్లి అక్కడికి వచ్చిన జనానికి అభివాదం చేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. హిందూపురానికి రావడం సంతోషంగా ఉందనీ, మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చానన్నారు. ఇక్కడ ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకే పట్టం కడుతూ వస్తున్నారన్నారు. తన తండ్రి ఎన్టీఆర్ నుంచి సోదరుడు బాలకృష్ణ వరకు తమ కుటుంబానికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. హిందూపురానికి నారా, నందమూరి కుటుంబాలు ఎప్పుడూ అండగా ఉంటాయని ఆమె తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. తెలుగుదేశం కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు ఎంత చేసినా తక్కువేననీ, ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. రానున్న ఎన్నికల సంగ్రామంలో దుర్మార్గపు వైసీపీని ప్రజలు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం క్లిష్టపరిస్థితుల్లో ఉందనీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే గాడిలో పడుతుందన్నారు. ఆ దిశగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు.

అధైర్యపడకండి..

హిందూపురం నుంచి గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి నారా భువనేశ్వరి వెళ్లారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక దిన్నేహట్టికి చెందిన కార్యకర్త ముత్తప్ప మరణించాడు. దీంతో ఆయన ఇంటికెళ్లి నారా భువనేశ్వరి కుటుంబసభ్యులను పరామర్శించారు. భువనేశ్వరిని చూడగానే కుటుంబసభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. వారిని ఓదార్చి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముత్తప్ప చిత్రపటానికి నివాళులర్పించారు. రూ.3 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు.

జిల్లాలో ముగిసిన పర్యటన

నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి యాత్ర మూడు రోజులపాటు జిల్లాలో కొనసాగింది. గురువారం ముగిసింది. మడకశిర నుంచి నారా భువనేశ్వరి సాయంత్రం పుట్టపర్తి సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయల్దేరి వెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీమంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పురంలో అంజినప్ప చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తూ..



పురంలో చిన్నారికి నామకరణం చేస్తూ...



పుట్టపర్తి విమానాశ్రయంలో నారా భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేతలు



దిన్నెహట్టిలో కార్యకర్త కుటుంబానికి భరోసానిస్తూ..



పార్టీ వలంటీర్లతో గ్రూప్‌ఫొటో...

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

● రూ.10లక్షల ఆస్తి నష్టం



కూలిన ఇంటి గోడలు

నల్లచెరువు, ఫిబ్రవరి 15: మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామంలో చాకలి రెడ్డెప్ప నివాస గృహం గురువారం ఉదయం వంట గ్యాస్ సిలిండర్ పేలి కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై బాధితుడు రెడ్డెప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ కుమార్తె వివాహం అన్నమయ్య జిల్లా ములకలచెరువులో ఉండడంతో అందరం బుధవారం రాత్రి వెళ్లామన్నారు. గురువారం ఉదయం 6గంటల సమయంలో ఇంటిలో వంట గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలిందన్నారు. విషయం తెలియగానే తాము 7గంటలకు వచ్చి చూడగా.. నూతనంగా నిర్మించుకున్న ఇల్లు కూలిపోయిందన్నారు. ఇంటి లోపలిభాగం గోడలు పూర్తిగా పడిపోయాయని, బయటి భాగం గోడలు నెర్రెలు చీలాయని అన్నారు. నివాసం ఉండేందుకు ఆ ఇల్లు పనికిరాదన్నారు. ఇంటిలోని సామగ్రి కూడా పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఈ ఘటనతో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లిందన్నారు. కుమార్తె వివాహానికి వెళ్లడంతో అందరం ప్రాణాలు దక్కించుకున్నామన్నారు. విషయంపై నల్లచెరువు పోలీస్‌స్టేషన్‌లోనూ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సిలిండర్ పేలిన శబ్దానికి భయభ్రాంతులకు గురయ్యామని గ్రామస్థులు అంటున్నారు.

ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్శిటీలలో ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని ఇండియా ఫర్ ఇండియా ఫౌండేషన్ సలహదారు భరత్ భూషన్ తెలిపారు. నగరంలో ఈ కార్యక్రమ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. దేశంలోని అగ్రశ్రేణి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు ఉచిత కోచింగ్, మెంటరింగ్ సదుపాయం కల్పిస్తామని ఆయన తెలిపారు. కామన్ యూనివర్శిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ), కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (సీఎల్ఏటీ), నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ), రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఆర్ఐఈసీఈఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్ఐడీడీఏటీ) వంటి ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. దీంతోపాటు కెరీర్ ప్లానింగ్, సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9177098007 నంబరులో సంప్రదించాలని వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

వెబ్‌సైట్: www.indiaforindiafoundation.org
మెయిల్ ఐడీ: indiaforindiafoundation@gmail.com

వివాహేతర సంబంధంతో భర్త హత్య

● ప్రియుడితో కలిసి దారుణానికి ఒడిగట్టిన భార్య
● సున్నపుగుట్ట తండాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



ఖాదర్‌బాషా (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 15: వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో మందలించిన భర్తను భార్య ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ ఘటన కదిరి మండలంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సున్నపుగుట్టతండాకు చెందిన ఖాదర్‌బాషా(35), గులాబ్‌జాన్ దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. ఖాదర్‌బాషా ఐషర్ వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతను గతంలో పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ బాబ్‌జాన్ వద్ద అసిస్టెంట్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బాబ్‌జాన్ తరచూ ఖాదర్‌బాషా ఇంటికి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అతడికి గులాబ్‌జాన్‌తో పరిచయం ఏర్పడి, అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. కొద్దిరోజులకు విషయం భర్త ఖాదర్‌బాషాకు తెలియడంతో తరచూ భార్యతో ఘర్షణ పడేవారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 31న రాత్రి భార్యా భర్త తీవ్ర స్థాయిలో గొడవ పడ్డారు. గులాబ్‌జాన్ కర్రతో భర్త ఖాదర్‌బాషా తలపై బలంగా కొట్టడంతో అతను కింద పడిపోయాడు. విషయాన్ని ఫోన్‌ద్వారా ప్రియుడు బాబ్‌జాన్‌కు తెలియజేసింది. అతను వచ్చి చూసి ఖాదర్‌బాషా కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించాడు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి అతడి గొంతునులిపి చంపారు. అదే రాత్రి పొద్దుపోయాక మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో మండలంలోని కొరెడ్డిపల్లి ప్రాంతానికి తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించారు. శవం పూర్తిగా కాలకపోవడంతో మిగిలిన భాగాన్ని ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి దగ్గరలోని చెరువులో పడేశారు. అనంతరం తన భర్త కనిపించలేదని గులాబ్‌జాన్ ఈనెల 3వతేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కాగా గులాబ్‌జాన్‌కు బాబ్‌జాన్‌తో వివాహేతర సంబధం ఉందన్న విషయం తెలుసుకున్న పోలీసులు వారిపై నిఘా ఉంచి తమదైన శైలిలో విచారణ చేశారు. విచారణలో తన భర్తను ప్రియుడితో కలిసి చంపినట్లు గలాబ్‌జాన్ వెల్లడించింది. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహాభోగ్

ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు



ఇరుముడి తీసుకెళ్తున్న మాలధారులు



అలంకరణలో సేవాలాల్ మహరాజ్,

గుత్తి రూరల్, ఫిబ్రవరి 15: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు ముగిశాయి. చివరి రోజు గురువారం స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. సేవాలాల్ మాలధరించిన భక్తులు ఇరుముడులను సమర్పించారు. మాతా జగదాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి 101 మంది యువతులు బోనాలతో వెళ్లి సేవాలాల్ మహరాజ్‌కు సమర్పించారు. ముగింపు ఉత్సవాల్లో అత్యంత కీలకమైన మహాభోగ్ కార్యక్రమాన్ని రాజస్థాన్ పీఠాధిపతి రమేష్ గూరుజీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, రవీంద్ర నాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, యస్‌కే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మహాభోగ్‌ను నిర్వహిస్తున్న పీఠాధిపతి రమేష్ గురూజీ



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న యువతులు

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: రాబోవు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు ఆదేశించారు. గురువారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2023-24 రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ క్రాపింగ్, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 15: ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 16వతేదీన ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదివి 22-32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, డ్రైవింగ్ లైసెన్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, పెనుకొండ, కదిరి, గోరంట్ల, హిందూపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 6305900106, 9550676098లను సంప్రదించాలని కోరారు.

20లోపు వివరాలు నమోదు చేయాలి: డీఈఓ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15: జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూళ్లు ఈనెల 20వ తేదీలోపు విద్యాశాఖ పోర్టల్‌లో తమ వివరాలు నమోదుచేయాలని డీఈఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోని స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తామన్నారు.

ఫారం-7 తిరస్కరణపై ఫిర్యాదు



ఎన్నికల అధికారికి వినతి పత్రం ఇస్తున్న బ్యాళ్లరాము

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15: అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో ఫారం-7 దరఖాస్తులను బీఎల్ఓలు తిరస్కరించారని టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బ్యాళ్ల రాము అన్నారు. రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వసంతబాబుని కలసి ఫారం-7 దరఖాస్తుల రద్దు అంశంపై గురువారం ఫిర్యాదు చేశారు. కొడిమిలోని 44, 45 పోలింగ్ కేంద్రాల పరిధిలో స్థానికేతరులు, ఇళ్లు లేనివారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చారని అన్నారు. వారి పేర్లను తొలగించాలని కోరుతూ ఫారం-7 కింద 740 దరఖాస్తులు సమర్పించామని, అందులో 340 మాత్రమే తొలగించారని అన్నారు. మిగిలిన వాటిని తొలగించకుండా, దరఖాస్తులను తిరస్కరించారని అన్నారు. దీనిపై బీఎల్ఓలు సరైన సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. అధికార పార్టీ వారి ఒత్తిళ్ల కారణంగానే వాటిని తొలగించకుండా అలానే ఉంచారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు వన్నూరు స్వామి, నాయకులు శ్రీకంఠం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్‌ పథకాలతో ప్రజలందరికీ న్యాయం

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి15: ప్రజలందరికీ న్యాయం చేసేందుకు చంద్రబాబు సూపర్‌సిక్స్‌ పథకాలు రూపొందించారని టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మండలంలోని బుడ్డారెడ్డిపల్లి, ఏలుకుంట్ల, తనకంటివారిపల్లి గ్రామాల్లో గురువారం వారు బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటీ తిరుగుతూ ప్రజలకు సూపర్‌ సిక్స్‌ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంచుతూ వాటి గురించి వివరించారు. కుటుంబంలో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి.. వాటి నుంచి ఏ మేరకు లబ్ధి చూకూరుతుందో తెలియజేశారు. చంద్రబాబు ప్రకటించిన ఈ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో చంద్రబాబును, ధర్మవరంలో పరిటాలశ్రీరామ్‌ను ఆదరించాలని కోరారు. అనంతరం పరిటాల శ్రీరామ్‌ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వినూత్నంగా ఏర్పాటుచేసిన ఫిర్యాదుల బాక్సుల్లో ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదులను వేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ పోతుకుంట లక్ష్మన్న, నాయకులు విజయసారథి, రాఘవరెడ్డి, తలారి వెంకటలక్ష్మి, పోతులయ్య, ఏగినాటి రమణ, జయప్రకాష్‌రెడ్డి, గుత్తాసూరి, మలసాని బాస్కర్‌, అశ్వత్థనాయుడు, గరుడంపల్లి చంద్రశేఖర్‌, నేలకోట రామ్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌, రమణమోహన్‌, తిరువీధుల పురుషోత్తం, రామకృష్ణ, మల్లి, కేశవనాయుడు, బడన్నపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం మండలం ఏలుకుంట్లలో కరపత్రాలను పంచుతున్న టీడీపీ శ్రేణులు

నేడు శివానగర్‌లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరం: పట్టణంలోని శివానగర్‌లో శుక్రవారం టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రచారకమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యూనిట్‌, సెక్షన్‌ ఇన్‌చార్జిలు, బూత్‌ కన్వీనర్లు కదిరి గేటు వద్ద గల బ్రహ్మంగారి ఆలయం వద్దకు ఉదయం 9గంటలకు రావాలని వారు కోరారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరిన నాయకులు

టీడీపీలోకి మాజీ ఎంపీపీలు, సర్పంచులు

● ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో చేరిక

కదిరి, ఫిబ్రవరి 15: తలుపుల మండలానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలోకి చేరా రు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌, నాయకుడు పీవీ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వారు అమరావతిలోని ఉండవల్లికి వెళ్లి అధినేత నారా చంద్రబాబునాయుడి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చంద్రబాబు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ ఎంపీపీ మనోహర్‌రెడ్డి, సర్పంచ్‌ మల్లికార్జున, విజయారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సుదర్శన్‌ రెడ్డితోపాటు 25కుటుంబాల వారు ఉన్నారు. పార్టీ విజయం కోసం సైనికుల్లా పని చేయాలని చంద్రబాబు సూచించినట్లు వారు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి



ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహం

ధర్మవరం, ఫిబ్రవరి 15: పట్టణంలోని ఎస్‌ఎల్వీ మార్కెట్‌ వీధిలో గల సుబ్రమణ్య, నాగదేవతల ఆలయంలో గురువారం సుబ్రమణ్యషష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవతల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదమంత్రోచ్చారణల నడుమ పూజలు ఘనంగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. నాగదేవతల విగ్రహాలకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

బైక్‌ ర్యాలీని విజయవంతం చేయండి

కదిరిఅర్బన్‌, ఫిబ్రవరి 15: శ్రీకృష్ణ దేవరాయల జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం చేపట్టనున్న బైక్‌ ర్యాలీని విజయవంతం చేయాలని బలిజ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీలకతీతంగా బలిజలు కదిరి డివిజన్‌లోని ప్రతి మండల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. సాయంత్రం 3గంటలకు ఆర్‌అండ్‌బీ బంగ్లానుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌, జీవిమాన్‌సర్కిల్‌, కోనేరు, హిందూపురం క్రాస్‌, టవర్‌క్లాక్‌ మీదుగా సాగి ఆర్‌అండ్‌బీ బంగ్లాకు తిరిగి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసులు, ఆది, కూనక పుల్లయ్య, గవ్వల శ్రీనివాసులు, సురేష్‌కుమార్‌, మల్లికార్జున, ఎన్‌వీ ప్రసాద్‌, ఎర్రమశెట్టి రమేష్‌బాబు, కుటాల లక్ష్మణ్‌, గరడాల రమణ, జనార్దన్‌, మల్లెం రాము, కంచెం నాగేంద్ర తదితరులున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు ఎన్‌బీఏ గుర్తింపు

కదిరిఅర్బన్‌, ఫిబ్రవరి 15: కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలకు నేషనల్‌ బోర్డు ఆఫ్‌ అక్రిడిటేషన్‌ (ఎన్‌బీఏ) గుర్తింపు దక్కింది. కళాశాలలో డిప్లొమా ఇన్‌ ఆటోమొబైల్‌ ఇంజనీరింగ్‌, డిప్లొమా ఇన్‌ ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ ఇంజనీరింగ్‌ మూడు సంవత్సరాల కాలపరిమితితో ప్రోగ్రామ్స్‌ ఉన్నాయి. ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్‌ ఇంజనీరింగ్‌ ప్రోగ్రామ్‌ డిప్లొమాకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్‌ నారాయణ గురువారం తెలిపారు. పాలిటెక్నికల్‌ విద్యను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్వహించాలన్న ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగంగా ఎన్‌బీఏ గుర్తింపుతో ముందడుగు వేస్తామన్నారు. సాంకేతిక విద్యాశాఖ కమిషన్‌ ఆదేశాలతో ఎలక్ట్రికల్‌, ఎలక్ట్రానిక్‌ ఇంజనీరింగ్‌ డిప్లొమా బ్రాంచ్‌కు 2024-25 విద్యాసంవత్సరంనుంచి మూడు సంవత్సరాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించింది. కళాశాలలో పనిచేస్తున్న అందరి సహకారంతో గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపాల్‌ పేర్కొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బంది నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ, ఫిబ్రవరి15: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలోని మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వద్ద గురువారం వైద్య, ఆరోగ్య సిబ్బంది ఏపీ ఎన్జీఓ కదిరి తాలుకా ప్రెసిడెంట్‌ వేణుగోపాల్‌ రెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం డీఏ అరియర్స్‌, కాంట్రాక్ట్‌ ఉద్యోగుల రెగ్యులైజేషన్‌, సీపీఎస్‌ రద్దు వంటి 16 డిమాండ్లను నెరవేర్చకుండా.. కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టినట్లు తెలిపారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

● ఏపీ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి జేవీ రమణ

ధర్మవరం, ఫిబ్రవరి 15: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం కల్పించాలని ఏపీ రైతుసంఘం జిల్లా సహాక కార్యదర్శి జేవీ రమణ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. పట్టణంలోని రైతుసంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామినాథన్‌ కమిషన్‌ సిఫారసు అమలు చేయాలని, రైతు రుణాలు రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణవిముక్తి చట్టాన్ని తీసుకురావాలని, నాలుగు లేబర్‌ కోడ్‌లు రద్దు చేయాలని అన్నారు. ఉపాధి హామీ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలన్నారు. అలాగే ఆహార భద్రత చట్టాన్ని తీసుకురావాలని, భూ హక్కుల చట్టం రద్దు చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ఇన్‌పుట్‌, ఇన్సూరెన్స్‌ను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయానికి విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని, మోటార్లకు స్మార్ట్‌మీటర్లు బిగించరాదని తెలిపారు. ఈ డిమాండ్ల సాధనకు శుక్రవారం తలపెట్టిన భారత్‌ గ్రామీణ బంద్‌ను రైతులు, కార్మికులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

కదిరిఅర్బన్‌: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేకవిధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్‌ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించిన మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. డాక్టర్‌ స్వామినాథన్‌ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, రైతు రుణమాఫీ చేయాలని, కేరళ తరహాలో రుణ ఉపశమనం చట్టం ప్రవేశపెట్టాలని డిమాండ్‌ చేశారు. ఈ డిమాండ్ల సాధనకు సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. రైతు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినియోగదారులు, వృత్తి సంఘాలు, విద్యార్థి,యువజన, మహిళ సంఘాలు పాల్గొనాలని కోరారు.

తనకల్లు: దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ శుక్రవారం జరగనుందని, జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రెడ్డెప్ప ప్రకటనలో తెలిపారు. ఆంధ్రరాష్ట్రానికి మోడీ ప్రత్యేక హోదా నిరాకరించి అన్యాయం చేశారన్నారు. స్వామినాథన్‌ కమిటీ సిఫార్సులు అమలు చేయలేదన్నారు. ఇందుకు నిరసనగా చేపట్టే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ అనుబంధ సంస్థలు బంద్‌లో పాల్గొనాలని కోరారు.

నిబంధనల మేరకే ఉద్యోగోన్నతి కల్పించాలి

● ఎన్‌ఎంయూ డిమాండ్‌

ధర్మవరం, ఫిబ్రవరి 15: గతంలో ఆర్టీసీలో ఇచ్చిన విధంగానే అన్ని కేటగిరిల ఉద్యోగులకు 2011 నార్మ్స్‌ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని ఎన్‌ఎంయూ జోన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ వైజే ప్రేమ్‌కుమార్‌, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌, మధు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట వారు ఎన్‌ఎంయూ నాయకులు, కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రిటైర్డ్‌ అయిన, చనిపోయిన ఉద్యోగుల సెటిల్మెంట్ల విషయంలో ఏర్పడిన జాప్యాన్ని నివారించాలన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న అన్ని సెటిల్మెంట్లను పరిష్కరించాలన్నారు. 2016కు ముందు చనిపోయిన ఉద్యోగుల వారసులకు ఆర్టీసీ సర్వీస్‌రూల్స్‌ ప్రకారం కారుణ్య నియామకాలు జరిపి ఉద్యోగ భృతి కల్పించాలన్నారు. చనిపోయిన ఉద్యోగుల పిల్లలు ఇతర రాష్ట్రాల్లో చదువుకున్నారనే కారణంగా కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని, ఆ విధానాన్ని వీడనాడాలని అన్నారు. అలాగే 3వేల కొత్త బస్సులు కొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేటగిరిలో ఖాళీలు ఏర్పడుతున్నందున వెంటనే డైరెక్ట్‌ రిక్రూట్‌ చేపట్టి భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో గ్యారేజ్‌ అధ్యక్షకార్యదర్శులు హరికృష్ణ, కుమార్‌, నాయకులు హనుమాన్‌, వైవీఎస్‌రెడ్డి, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు

ఎంపీడీఓ కార్యాలయంలో వైసీపీ సమావేశం

● ప్రభుత్వాఫీసులో పార్టీ కార్యక్రమాలేమిటని ప్రజల విమర్శ

గాండ్లపెంట, ఫిబ్రవరి 15: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైసీపీ నాయకులు కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. దీనిపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈనెల 18వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ రాప్తాడుకు విచ్చేయనున్నారు. ఇందుకు జన సమీకరణ కోసం ఎంపీడీఓ కార్యాలయంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మగ్బుల్‌బాషా, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, నాయకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ జగన్మోహన్‌రెడ్డి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అయితే ప్రభుత్వ కార్యాలయంలో పార్టీ సమావేశాలు నిర్వహించడమేమిటని ప్రజలు మండిపడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయమా లేక వైసీపీ కార్యాలయామా అని పెదవి విరుస్తున్నారు. పార్టీ కార్యకలాపాలు ఇలా ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడం సరికాదని పలువురు చర్చించుకున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశమైన వైసీపీ నాయకులు

షోకాజ్‌ నోటీసులు వెనక్కు తీసుకోవాలి: ఎస్టీయూ

నంబులపూలకుంట, ఫిబ్రవరి 15: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి జడ్పీ పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడితో పాటు ముగ్గురు ఉపాధ్యాయులకు డీఈఓ మీనాక్షి బుధవారం షోకాజ్‌ నోటీసులు ఇచ్చారు. కాగా ఉపాధ్యాయులకు షోకాజ్‌ నోటీసులివ్వడాన్ని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. చిన్న సమస్యలను భూతద్దంలో చూపి నోటీసులివ్వడం అన్యామన్నారు. ఉపాధ్యాయులు ఇప్పటికే తీవ్రమైన పని వత్తిడితో మానసికంగా కుంగిపోతున్నారని, ఇదిచాలదన్నట్లు నోటీసులిచ్చి మరింత ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. తక్షణం షోకాజ్‌ నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

ఆలయంలో అవుట్‌ సోర్సింగ్‌ పోస్టులు భర్తీ చేయలేదు

కదిరి, ఫిబ్రవరి 15: పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో అవుట్‌సోర్సింగ్‌ పద్ధతిలో ఎటువంటి పోస్టులు భర్తీ చేయలేదని ఆలయ డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కల్యాణకట్టలో ఆరు అవుట్‌సోర్సింగ్‌ పోస్టుల నియామకాలను నిలుపుదల చేశారని, ఈపోస్టుల్లో ఎవరినీ నియమించలేదని అన్నారు. పండుగ, పర్వదినాల్లోనూ, వారం చివరి రోజుల్లోనూ నాయీబ్రాహ్మణ సేవలను అవసరం మేరకు ఉపయోగించుకుంటామన్నారు. ఇందుకు గాను పట్టణంలో ఉన్న నిరుద్యోగయువ క్షురకుల మాత్రమే ప్రాధ్యాత ఇవ్వబడుతుందన్నారు. సామాజికమాధ్యమాల్లో నిరాధారమైన, అసత్యమైన ఆరోపణలు చేసి, ఆలయ ప్రతిష్ఠను దిగజార్చవద్దని పట్టణంలోని క్షురక సంఘాలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ ఏపీఓగా సుధాకర్‌

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 15: ఉపాధి హామీ పథకం మండల ఏపీఓగా సీ. సుధాకర్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బత్తలపల్లి ఏపీఓగా ఉన్న ఈయన బదిలీపై ఓడీసీకి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి సోమందేపల్లికి బదిలీ అయ్యారు. నూతన ఏపీఓ మాట్లాడుతూ మండలంలో ఎవరూ వలస వెళ్లకుండా పనులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఆయనకు ఉపాధిహామీ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

కదిరిఅర్బన్‌, ఫిబ్రవరి 15: కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం ఆ కేంద్రంలోని ప్రధానశాస్త్రవేత్త సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. వేతనంతో కూడిన సెలవులు అమలు చేయాలన్నారు. పని ప్రదేశంలో కార్మికులు పాముకాటు, ఇతర ప్రమాదాలకు గురైనప్పుడు పరిశోధన కేంద్రం అధికారులు బాధ్యత తీసుకుని వైద్యం చేయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్‌, రామమోహన్‌, వర్కర్స్‌ యూనియన్‌ నాయకురాళ్లు పద్మావతి, పాతిమా, మంజుల, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకు సాగాలి

పుట్టపర్తి, ఫిబ్రవరి 15 : ప్రతి వలంటీరు సేవాభావంతో ముందుకు సాగాలని కలెక్టర్‌ అరుణ్‌బాబు సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన గ్రామ, వార్డు వలంటీర్లకు అభినందనసభ ఏర్పాటుచేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరోనా సమయంలో వలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో 9343మంది వలంటీర్లను సన్మానించారు. ఇందులో సేవా వజ్ర కింద రూ.45వేలు, సేవా రత్న కింద రూ.30వేలు, సేవామిత్ర ద్వారా రూ.15వేలు వంతున వలంటీర్లకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్‌ బోయ గిరిజమ్మ, సచివాలయ ఏఓ శివారెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి



ముస్లింలకు యాసిన్‌ సూర ఫొటోను అందజేస్తున్న టీడీపీ మైనార్టీ నాయకులు

ధర్మవరం, ధర్మవరంరూరల్‌, ఫిబ్రవరి 15: టీడీపీతోనే ముస్లిం మైనార్టీల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ హిందూపురం పార్లమెంటరీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌ హుస్సేన్‌ పేర్కొన్నారు. పట్టణంలోని 27వ వార్డులో గల ముస్లిం కుటుంబాలకు గురువారం ఆయన మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి యాసిన్‌సూర ఫొటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగూర్‌హుస్సేన్‌ మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలందరూ టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్‌ అధ్యక్షుడు అత్తార్‌ రహీంబాషా, నాయకులు రాళ్లపల్లి షరీఫ్‌, ఇమాములు, అస్లాం, మహబూబ్‌బాషా, ఉస్మాన్‌, టీడీపీ పట్టణాధ్యక్షుడు పరిశేసుధాకర్‌, నాయకులు పాల్గొన్నారు.

అలాగే ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామంలో పరిటాలరవీంద్ర మెమోరియల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలకు యాసిన్‌సూర ఫొటోలను టీడీపీ స్థానిక నాయకులు, మైనార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

టీడీపీ విజయానికి కృషి చేయండి

ధర్మవరం, ఫిబ్రవరి 15: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం విజయానికి కృషిచేయాలని ఆ పార్టీ నాయకులు సెక్షన్‌ ఇన్‌చార్జిలకు సూచించారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో పార్టీ 25వ వార్డు ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు స్వగృహంలో గురువారం రాత్రి వారు అన్ని వార్డులలోని సెక్షన్‌ ఇన్‌చార్జిలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వార్డుల్లో కేటాయించిన ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా.. ఒక వేళ అందకుంటే.. ఎందుకు అందలేదో వివరాలు సేకరించాలన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు ప్రకటించిన పథకాలు అమలవుతాయని తెలియజేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్‌,పురుషోత్తంగౌడ్‌, నాగూర్‌హుస్సేన్‌, భీమనేని ప్రసాద్‌నాయుడు, చీమలరామాంజి, గడ్డంకుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



సెక్షన్‌ ఇన్‌చార్జిలతో సమావేశమైన టీడీపీ నాయకులు

దర్గాలో చోరీ..

● 30 తులాల వెండి ఆభరణాలు, రూ.6వేల నగదు అపహరణ

బత్తలపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని వెంకటగారిపల్లి సమీపంలో గల దర్గాలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంకటగారిపల్లి సత్రం సమీపంలో మరుగొడ్డు వంక వద్ద ఉన్న దర్గాలో రోజూలాగే నిర్వాహకులు బుధవారం పూజలు చేసి అనంతరం తాళాలు వేసి వెళ్లారు. తర్వాత గురువారం ఉదయం వచ్చి చూడగా.. తాళాలను పగిలిపో యి కనిపించాయి. దీంతో వారు దర్గాలోకి వెళ్లిచూడగా వెండి ఆభరణాలు కనిపించలేదు. హుండీలోని డబ్బులు కూడా లేవు. దీంతో వెంటనే ముజావర్‌ వలీసాబ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 30 తులాల వెండి ఆభరణాలు, హుండీలోని రూ. 6వేల నగదును దొంటలు చోరీ చేశారని చెప్పారు. ఎస్‌ఐ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్‌ టీంతో సంఘటన స్థలంలోని వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



దర్గాలో పరిశీలిస్తున్న పోలీసులు

ఎస్‌ఐగా ధరణీబాబు బాధ్యతలు

తనకల్లు, ఫిబ్రవరి 15: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా ధరణీబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రాజశేఖర్‌ పుట్టపర్తిఅర్బన్‌ పోలీస్‌ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ధరణీబాబు మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు. స్టేషన్‌లో సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయండి: బీజేపీ

పుట్టపర్తి, ఫిబ్రవరి 15: వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా రాష్ట్రంలో బీజేపీ చేపడుతున్న ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కన్వీనర్‌ రొద్దం ఉత్తమరెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయస్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజు రోజుకూ వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు పెరిగిపోతున్నాయని విమర్శించారు. ఇందుకు నిరసనగా ఈ నెల 21 నుంచి 29వ తేదీవరకు వరకు 9 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపోరు యాత్ర తలపెట్టామన్నారు. దీనిని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అలాగే ప్రధాని నరేంద్రమోదీ అందిస్తున్న ప్రజారంజక పాలన, కేంద్ర పథకాలపై కూడా ప్రజలకు వివరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల, అసెంబ్లీ, పార్లమెంట్‌ స్థాయిలో సమావేశం నిర్వహించి పోరు యాత్రను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్‌, నాయకులు గుడిసె దేవానంద్‌, ఆంజనేయులు, సుమతి, చలపతి, కత్తిరాజారెడ్డి, లాయర్‌ హరికృష్ణ, కొండమరాజు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్దన్‌రెడ్డి

తొలగని డబుల్‌ ఎంట్రీలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

ధర్మవరం, ఫిబ్రవరి 15: పట్టణంలోని అన్ని వార్డులకు సంబంధించిన ఓటర్ల జాబితాలో డబుల్‌ ఎంట్రీల తొలగింపులపై అధికారులు స్పందించలేదన్న విషయం ఓటర్ల తుది జాబితాను చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. ఏ వార్డులోని జాబాతా చూసినా ఓట్లు డబుల్‌ఎంట్రీగా దర్శనమిస్తున్నాయి. వీటిపై గతంలోనే ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఎల్వోలకు, అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు ఏ మాత్రం పట్టించుకోలేదు. 34వ వార్డులో సాకే వారాదప్ప, ఏస చంద్రమ్మ, మురళీ కృష్ణ సాకే వెంకటప్రసాద్‌, సాకే పేర్ల మీద ఓట్లు ఉన్నాయి. ఇవే ఓట్లు మండలంలోని ముచ్చురామి గ్రామంలో కూడా దర్శనమిస్తున్నాయి.



34వ వార్డులో జాబితాలో ఉన్న ఓట్లు

ముచ్చురామి గ్రామంలోని జాబితాలోనూ ఉన్న అవే ఓట్లు

తెగిపడుతున్న విద్యుత్ వైర్లు

● ఆందోళనలో గ్రామస్థులు



మేకల షెడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు

మడకశిర రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని మెళవాయి గ్రామంలో తరచూ విద్యుత్ వైర్లు తెగిపడుతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఆరు నెలల్లో రెండుసార్లు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇందుకు కారణం విద్యుత్ స్తంభాలు తక్కువగా ఉండి వైర్లు పొడవుగా ఉండడంతో పాటు ఎక్కువ వైర్లుకు జాయింట్‌గా ఉన్నాయి. దీంతో గాలి వేగం ఎక్కువైతే విద్యుత్‌వైర్లు తెగిపడుతున్నాయి. బుధవారం ఉదయం మెళవాయి గ్రామ ఎస్సీ కాలనీకి వెళ్లే విద్యుత్ వైర్లు తెగి మేకలు షెడ్‌పై పడ్డాయి. వెంటనే అక్కడే ఉన్న కాలనీ వాసులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది స్పందించి విద్యుత్‌ను నిలిపివేశారు. అనంతరం మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. దీనిపై లైన్‌మన్ బాలు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు ఒక దానికొకటి దూరంగా ఉండడంతో తర చూ వైర్లు తెగి పడుతున్నాయి. సమస్యను ఏఈ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపా రు. మరికొన్ని విద్యుత్ స్తంభాలు అవసరం ఉన్న చోట ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.

ఏపీఓ బదిలీ

రొద్దం, ఫిబ్రవరి 15 : మండల ఉపాధిహామీ ఏపీఓ రషీద్ కదిరి నియోజకవర్గం తలుపుల మండలానికి బదిలీ అయ్యారు. రొద్దం మండలంలో ఉపాధిహామీ పనులు నత్తనడకన సాగుతుండగా జిల్లాలోనే రొద్దం బమండలం అట్టడుగున ఉన్నట్లు సమాచారం. జిల్లాస్థాయి అధికారులు సైతం రొద్దం మండల అధికారులపై ఉపాధిహామీ పనులు వేగంగా పెంచాలని మందలించారు. ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తిస్థాయిలో లేకపోవడం, ఉన్నవారికి కూడా జీతాలు సరిగా అందడం లేదన్న విమర్శలున్నాయి. దీనికితోడు సకాలంలో బిల్లులు రాకపోవడం కారణంగా ఉపాధిహామీ పథకానికి కూలీలు రావడం లేదన్న విమర్శలున్నాయి. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓ లేకపోతే ఉపాధి పనులు ఎలా జరుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాలకవర్గంలో మరుగుదొడ్ల చిచ్చు

● కౌన్సిల్ సమావేశంలో డిసెంట్ నోటీస్ ఇవ్వడంపై ఓవర్గం గుర్రు
● వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్ భర్త ఫైర్
● అధికార పార్టీలో రాజుకుంటున్న చిచ్చు

హిందూపురం, ఫిబ్రవరి 15 : మునిసిపాలిటీ అధికార పార్టీ పాలకవర్గంలో మరుగుదొడ్ల చిచ్చు రాజుకుంటోంది. పరిగి బస్టాండులో మరుగుదొడ్లు నిర్మించేందుకు అజెండాలో అంశాన్ని పొందుపరిచారు. కౌన్సిల్ సమావేశంలో ఆమోదించలేదు. దీంతో ఓ వర్గానికి చెందిన కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. ఈ విషయం చినికి చినికి గాలివానగా మారి ఏకంగా ఓ వైస్ చైర్మన్‌పై దాడి చేసేందుకు కౌన్సిలర్ భర్త మునిసిపల్ కార్యాలయానికి వచ్చి రచ్చ చేశారు.

● డిసెంట్ ఇవ్వడంతో ఓ వర్గం గుర్రు

పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకూడదని అజెండాలో ఈ అంశం రద్దు చేయాలంటూ కౌన్సిల్ సమావేశం సందర్భంగా అజెండాలో ఉన్న ఈ అంశాన్ని రద్దు చేయాలని టీడీపీ, వైసీపీ సభ్యులు నోటీసు ఇచ్చారు. ఇలా డిసెంట్ ఇవ్వడం అధికార పార్టీలోని ఓ కౌన్సిలర్ భర్తతో పాటు కొంతమందికి మింగుడు పడలేదు.

● వైస్ చైర్మన్‌పై కౌన్సిలర్ భర్త ఫైర్

పరిగి బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి అజెండాలో డీసెంట్ ఇప్పించడంలో ఓ వైస్‌చైర్మన్ పాత్ర ఉందని, ఆయన చెప్పడం వల్లే కొంతమంది ఇచ్చారని ఓ కౌన్సిలర్ భర్త ఫైర్ అయ్యారు. కౌన్సిల్ సమావేశంలో డీసెంట్ ఇచ్చారని తెలిసిన వెంటనే ఆగమేఘాల మీద సదరు కౌన్సిలర్ భర్త మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, ఆవేశంతో ఊగిపోయాడు. చైర్‌పర్సన్ చాంబర్‌లో ఉన్న వైస్‌చైర్మన్ కిందకు వస్తే దాడి చేయడానికి కూడా సిద్ధమేనని చాలెంజ్ చేశాడు. గొడవ జరుగుతుందని భావించిన పోలీసులు వెంటనే అలర్ట్ అయి వైస్ చైర్మన్‌ను కిందకు రాకుండా అడ్డుకున్నారు. ఇందులో వైస్ చైర్మన్ పాత్ర ఏమీలేదని చెబుతున్నా కౌన్సిలర్ భర్త మాత్రం ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో సహకరించని వారికి భవిష్యత్తులో తగిన శాస్తి చేస్తామంటూ కార్యాలయంలో అక్కడున్న వారికి హెచ్చరికలు జారీ చేశాడు. ఈ విషయం అధికార పార్టీలో రాజుకుంటోంది. ఇది ఎక్కడికి దారి తీస్తుందోనని కొంతమంది కౌన్సిలర్లు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అధికార పార్టీలో ముఖ్య నేతలు.. కౌన్సిలర్ భర్తను రెచ్చగొడుతున్నట్లు వైస్ చైర్మన్ వర్గం భావిస్తోంది. ఇవన్నీ ఇలా ఉంటే కొంతమంది కౌన్సిలర్లతో చర్చించకుండా అజెండాలో పెట్టించారని తమకేమైనా చూసుకుని ఉంటే ఆమోదించేవారు కదా అని పేర్కొనడం విశేషం.



నోటీస్ అందజేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

అధిష్టానం అవకాశమిస్తే ఎంపీగా బరిలోకి..: పరిపూర్ణానంద

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 15: బీజేపీ అధిష్టానం అవకాశం కల్పిస్తే ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటానని కాకినాడ శ్రీపీఠం మఠాధిపతి శ్రీ పరిపూర్ణనందస్వామి వెల్లడించారు. గురువారం పట్టణంలోని మడకశిర రహదారిలో బీజేపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో స్వామీజీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ క్రమశిక్షణ, సిద్ధాంతాలతో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని మండలాల్లో అన్ని సామాజిక వర్గాలను కలుపుని అభిప్రాయాలను సేకరిస్తున్నానన్నారు. విజయనగర సామ్రాజ్యం పరిపాలించిన హిందూపురం నియోజకవర్గంలో పర్యటించడం హర్షణీయమన్నారు. బీజేపీ అధిష్టానం అవకాశం కల్పిస్తే వచ్చే ఎన్నికల్లో హిందూపురం పార్లమెంట్ నుంచి ఎంపీగా బరిలో నిలిచి అన్ని సామాజిక వర్గాలతో మమేకమై విజయకేతనం ఎగురవేస్తానని అభిప్రాయం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న పరిపూర్ణానందస్వామి

ఉచిత న్యాయసదస్సు


పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 15: పెనుకొండ నగర పంచాయతీ ఇస్లాంపురంలో టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో దుర్గాశక్తి సొసైటీవారు గురువారం ఉచిత న్యాయసేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యనిర్వాహణ అధికారిణి సవిత మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, మహిళలు చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళల చదువుతోనే కుటుంబాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. మద్యం సేవించడం ద్వారా జరిగే అనర్థాలను నాటక రూపంలో ప్రదర్శించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మద్యంతో సంసారాలు నాశనం అవుతున్నాయని, తాగిన మత్తులో విచక్షణ కోల్పోయి గొడవలకు పాల్పడు తున్నారని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు లక్ష్మమ్మ, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



రథంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి బ్రహ్మారథోత్సవం

రొళ్ల, ఫిబ్రవరి 15: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా మండలంలోని రత్నగిరిలో వెలిసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మారథోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి తమ మొక్కుబడులు తీర్చుకొన్నారు. స్వామి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. రథంపై స్వామిని ఊరేగించి భక్తులు పరవశించిపోయారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేశారు.



స్వామికి క్షీరాభిషేకం

భక్తిశ్రద్ధలతో పాలపొంగుల షష్ఠి

మడకశిర టౌన్/పావగడ, ఫిబ్రవరి 15: ప్రసిద్ధిగాంచిన నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం పాలపొంగుల షష్ఠిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాగుల ప్రతిమకు అర్చకులు నైవేద్యాలు, తైలాభిషేకం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉద యం నుంచే భక్తులు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన స్వామి ని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాదిమంది భక్తులు కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చారు.



కొలువుదీరిన చంద్రమౌళీశ్వరస్వామి



అలంకరణలో స్కందుడు

స్థల వివాదంపై కేసు నమోదు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 15 : మండలంలోని కురుబవాండ్లపల్లిలో స్థల వివాదంపై ఇరు కుటుంబాల ఘర్షణలో ఒకరిపై కేసు నమోదుచేసినట్లు కియా ఇండస్ట్రీయల్ ఎస్ఐ రంగడు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కురుబవాండ్లపల్లి గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణ పనులుజరుగుతున్నాయి. ఈక్రమంలో గ్రామానికి చెందిన కురుబ ఆంజనేయులు, ఆదినారాయణలు స్థల వివాదంపై ఒకరినొకరు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఆదినారాయణ, మూకుమ్మడిగా గాయపరిచి తీవ్రంగా గాయపరిచినట్లు అదే గ్రామానికి చెందిన కురుబ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ, ఫిబ్రవరి 15 : స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఏడు రోజులుగా మహదేవపల్లిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలునాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ పనులు స్వయంగా చేసుకుంటూ తోటివారికి సాయపడడమే ఎన్ఎస్ఎస్ ధ్యేయమన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేపట్టిన పనులు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామాంజినేయులు, ఎన్ఎస్ఎస్ పీఓ జయప్ప, కాంతారావు, రంగనాయకులు, అధ్యాపకులు విష్ణువర్ధన్, చంద్రశేఖర్, ఫర్నాజ్, నాగరాజు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్ఓ బదిలీ

చిలమత్తూరు, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ఎస్.ఓ రెహానా ఎన్.పి కుంట కేజీబీవికి బదిలీపై వెళ్లారు. ఎన్.పి కుంట కేజీబీవి పాఠశాల ఎస్.ఓ సునీత బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెహానా బదిలీపై వెళ్లరాదని విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. మాకు రెహానా మేడమే కావాలంటూ గేటు బయట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న డిఈఓ మీనాక్షి స్థానిక విద్యాశాఖ అధికారులు చిలమత్తూరు కేజీబీవికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, ఇలాంటి వాటిని పట్టించుకోకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కొత్త ఎస్.ఓ వచ్చినా మీతో బాగా చూసుకుంటారన్నారు. పాఠశాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పోలీసుల అదుపులో జూదరులు..?

లేపాక్షి, ఫిబ్రవరి 15 : పేకాట రాయుళ్లపై పోలీసులు ఉక్కుపాద ం మోపినట్లు తెలుస్తోంది. కోడిపల్లి పంచాయతీ నాగేపల్లి గ్రామం చివర భారీగా పేకాట ఆడుతున్నారన్న పక్కాసమాచారంతో స్థానిక పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పలువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు పోలీసులు సమాచారం ఇవ్వకపోవడంతో పట్టుబడిన వారిలో వైసీపీ నాయకులు ఉన్నారని వారిని తప్పించేందుకే సమాచారాన్ని గోప్యంగా ఉంచారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఎస్ఐను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

'నిజం గెలవాలి'కి తరలిన టీడీపీ నాయకులు

రొళ్ల, ఫిబ్రవరి 15: నిజం గెలవాలి కార్యక్రమానికి టీడీపీ నాయకులు తరలి వెళ్లారు. నారా భువనేశ్వరి చేపట్టిన కార్యక్రమానికి గురువారం మండలం నుంచి దిన్నేహట్టి గ్రామానికి భారీగా తరలివెళ్లారు. మల్లినమడుగు తదితర గ్రామాల నుంచి అనేక మంది మహిళలు, టీడీపీ నాయకులు బయలుదేరి వెళ్లారు. టీడీపీ నాయకులు మారన్న, సిద్దప్ప, యంజారప్ప, నాగరాజు, కాంతరాజు, మహిళలు పద్మ, రంగమ్మ తదితరులు బయల్దేరి వెళ్లారు.



దిన్నేహట్టికి బయల్దేరుతున్న రొళ్ల మండల నాయకులు

ఘనంగా సేవాలాల్ జయంతి

మడకశిర టౌన్/పావగడ, ఫిబ్రవరి 15: తండావాసుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాల యంలో గురువారం ఉదయం ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఘనంగా జరుపుకొన్నారు. గ్రేడ్-2 తహసీల్దార్ నరసింహమూర్తి, ఆర్ఐ రాజగోపాల్, సాంఘిక సంక్షేమ అధికారి మల్లికార్జున, సీడీపీఓ సునీత, బీఈఓ ఇంద్రాణి, తదితరులు కలిసి సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మడకశిర పట్టణంలో సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని వాల్మీకి సర్కిల్ నుండి సేవాలాల్ చిత్రపటాన్ని ప్రత్యేక రథంపై ఉంచి ఘనంగా పూజలు నిర్వహించారు. వాల్మీకి సర్కిల్ నుండి మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ సేవలను కొనియాడారు.



మడకశిరలో సేవాలాల్ ఊరేగింపులో బంజారాలు



ధర్నా చేస్తున్న కార్మికులు

కార్మికుల ధర్నా

మడకశిరటౌన్, ఫిబ్రవరి 15: సమస్యలు పరిష్కరించాలని కార్మికులు గురువారం ధర్నా చేపట్టారు. మడకశిర నగర పంచాయతీ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు చేపట్టిన ధర్నాలో మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు సమ్మె చేపడితే ప్రభుత్వ హామీతో సమ్మె విరమించామన్నారు. కార్మికులకు జీతాల పెంపు, హెల్త్ అలవెన్సులు, డ్రైనేజీ కార్మికులకు రూ.24,500 జీతం ఇస్తామని హామీల్లో వేటినీ నెరవేర్చలేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరింత ఉద్యమిస్తామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు రామాంజనేయులు, బాలు, మల్లేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

మట్టి తరలిపోతున్నా పట్టదా..?

● సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 15: ఆంధ్ర మట్టిని కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని పారిశ్రామిక వాడ రోడ్లకు తరలిస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్ ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన మట్టిని అక్రమంగా ఎక్స్‌కవేటర్లు, ఉపయోగించి టిప్పర్‌లలో నింపి పంపుతున్నారన్నారు. రోజూ వందల టిప్పర్లలలో మట్టి తరలిపోతున్నా అధికారులు కిక్కురుమనకుండా ఉన్నారన్నారు. ఎక్స్‌కవేటర్లు కూడా మునిగి పోయేంత లోతుగా గుంతలు ఉన్నాయంటే ఎంత కాలం నుంచి ఎన్ని మట్టి తరలించారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆ గుంతలను పూడ్చడానికి పరిశ్రమల్లోని మట్టిని తరలించి కాలుష్యం పెంచుతున్నారన్నారు. వర్షాకాంలో నీరు కొటిపి చెరువుకు ఈ ప్రాంతం నుంచి చేరుతుందని, అలాంటపుడు ఈ కలుషిత మట్టి చెరువుకు చేరితే పశుపక్షాదులకు మృత్యువాత తప్పదన్నారు. కాలువల ద్వార పంటపొలాలకు వాడుకుంటే పంటలు పండవన్నారు. అంతే కాకుండా ఆ నీటిలో ఉండటంతో రైతులకు చర్మవ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. భూగర్భజలాలు కలుషితమవుతాయన్నారు. పారిశ్రామిక వాడ నుంచి కొటిపికి వెళ్లే దారి పక్కనే ఉండటంతో వర్షాకాలంలో గుంతల్లో నీరు చేరితే అందులో ప్రమాదవశాత్తు ఎవరైనా పడితే అంతే సంగతులు అని ఆగ్రహించారు. పలు మార్లు అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోకపోవడంపై విమర్శలకు తావిస్తుందని, ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వాగ్వాదాల మధ్య ముగిసిన కౌన్సిల్ సమావేశం

● మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని మహిళా సభ్యుల అవేదన ● బాలయ్యపై ఆరోపణలను ఖండించిన టీడీపీ సభ్యులు



వాగ్వాదం చేస్తున్న ఇరు పార్టీల సభ్యులు

హిందూపురం, ఫిబ్రవరి 15: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఇరుపార్టీల సభ్యుల వాగ్వాదాల మధ్య ముగిసింది. గురువారం చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలోని అంశాలపై వాగ్వాదం చోటు చేసుకుంది. టీడీపీ కౌన్సిలర్‌లు మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన సమావేశాల్లో కాలయాపన చేసిందే తప్పా పట్టణ అభివృద్ధికి తీసుకొచ్చిన నిధులు, చేసిన అభివృద్ధి పనులు ఎక్కడో చూపాలన్నారు. ఇదే సమయంలో కొంత మంది మహిళా కౌన్సిలర్‌లు మాట్లాడుతూ ప్రతి కౌన్సిల్ సమావేశంలో మహిళా సభ్యులకు మాట్లాడేందుకు అవకాశం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ వార్డు వైసీపీ కౌన్సిలర్ రహమత్‌బీ చైర్‌పర్సన్ పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఇదే సమయంలో మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బాలయ్యపై ఆరోపణలు చేయగా మరోసారి గొల్లపల్లి రిజర్వాయర్‌పై మాట్లాడారు. దీంతో టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. అజెండాలోని 39 అంశాల్లో గురునాథ్ సర్కిల్, ఆర్‌పీజీటీ రోడ్డు పేరు మార్పు, పరిగి బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆమోదం తెలపలేదు. మిగిలిన అంశాలను సభ్యులు ఆమోదించారు.



నోటీసు అందజేస్తున్న సభ్యులు

దమ్ముంటే గొల్లపల్లి రిజర్వాయర్ నీరు ఆపండి..

ప్రతి కౌన్సిల్ సమావేశంలో గొల్లపల్లి రిజర్వాయర్ నీటిపై మాట్లాడే వైసీపీ సభ్యులకు దమ్మూ ధైర్యం ఉంటే నెల రోజుల పాటు నీటిని ఆపాలని టీడీపీ సభ్యులు డిమాండ్ చేశారు. గొల్లపల్లి నీరే రాకుండా ఉంటే ఈ పాటికి వైసీపీ కౌన్సిలర్లు హిందూపురం వదలాల్సి ఉండేదన్నారు. అప్పట్లో బాలకృష్ణ కేంద్ర మంత్రితో ఒప్పించి నీటిని తీసుకొచ్చారన్నారు. మీరు కనీసం బోరు మరమ్మతుకు వస్తే చేయించడానికి చేతకాక మిన్నకుండిపోతే వేము బిక్షాటన చేసి మరమ్మతులు చేయించామన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వైపు టీడీపీ కౌన్సిలర్ రాఘవేంద్ర చేయి చూపారని సభ నుంచి సస్పెండ్ చేశారు. ఐతే టీడీపీ సభ్యులతోపాటు కొంత మంది వైసీపీ కౌన్సిలర్‌లు పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్మించకూడదని డీసెంట్ నోటీసును అందించారు.

రాజకీయంగా దెబ్బ తీయడానికే కుట్రలు

హిందూపురం, ఫిబ్రవరి 15: తాను రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేకే కొంతమంది భారతి అనే మహి ళ ద్వారా బ్లాక్‌మెయిల్ చేయిస్తున్నారని వైసీపీ పట్టణ బీబ్లాక్ కన్వీనర్ వాటర్ నరేష్ పేర్కొన్నారు. తమ పార్టీకే చెందిన భారతికి ప్లాట్లు విక్రయించామని, ఆమె వద్దనుకున్న తర్వాత రూ.17 లక్షలు వాపసు ఇవ్వడానికి అంగీకరించానన్నారు. రూ.3 లక్షలు చెక్కు ద్వారా చెల్లించానని, మిగిలిన మొత్తం వాపసు ఇస్తానన్నా స్థలం వాపసు చేయడం లేదన్నారు. ఆమె వెనుక ఓ ప్రజాప్రతినిధి ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు. తన ఇంటి వద్దకు వచ్చి ఇంట్లో ఉన్న చెక్‌బుక్ ఎత్తుకెళ్లారని, పోలీసులకు ఫిర్యాదు చేశానని అన్నారు.

దగ్గు మందు అనుకుని..

గోరంట్ల, ఫిబ్రవరి 15: దగ్గు మందు అనుకుని పొరపాటున క్రిమిసంహారక మందు తాగి వృద్ధుడు అస్వస్థతకు గురయ్యాడు. మందలపల్లికి చెందిన సంగిరెడ్డి గురువారం క్రిమిసంహారక మందును తాగాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పావని చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

టీడీపీలోకి మాజీ ఎంపీపీలు, సర్పంచులు

● ఉండవల్లిలో చంద్రబాబు సమక్షంలో చేరిక

కదిరి, ఫిబ్రవరి 15: తలుపుల మండలానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలోకి చేరా రు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, నాయకుడు పీవీ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం వారు అమరావతిలోని ఉండవల్లికి వెళ్లి అధినేత నారా చంద్రబాబునాయుడి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చంద్రబాబు వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ ఎంపీపీ మనోహర్ రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, విజయారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, సుదర్శన్‌రెడ్డితోపాటు 25కుటుంబాల వారు ఉన్నారు.

టీడీ పల్లిలో తాగునీటి ఎద్దడి




నిరుపయోగంగా ఉన్న బోరు, బయట పడేసిన పైపులు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 15: మండలంలోని టీడీ పల్లి బీసీ కాలనీలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలనీ వాసులు తాగునీటి కోసం వ్యవసాయ బోర్ల దగ్గరకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు గిరి మాట్లాడుతూ గ్రామంలో 9 నెలల క్రితం మూడు తాగునీటి బోరు మోటర్లు కాలిపోయాయన్నారు. గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో ఆమిదాలగొంది సచివాలయం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు తాత్కాలికంగా రెండు బోర్లను మరమ్మతులు చేయించారు. అయితే గ్రామానికి దూరంగా ఉన్న బీసీ కాలనీలో ఉన్న బోరులోని మోటారు కాలిపోవడంతో మరమ్మతులు పనులు చేపట్లారు. బోరులోని పైపులు తీసి మోటారును తీసుకెళ్లారు. తొమ్మిదినెలలు అయినా బోరుకు మోటారు అమర్చలేదు. దీంతో కాలనీలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2 కి.మీ దూరం వెళ్లి వ్యవసాయ బోర్ల నుంచి మహిళలు తాగునీటిని తీసుకొస్తున్నారు. అసలే వేసవి కాలం ప్రారంభం కావడంతో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బోరుకు మోటారు బిగించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను ప్రజలు కోరతున్నారు. వేసవిలో మరింత ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.

బోర్లు వేయిస్తాం: మహేశ్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామంలో కొత్త బోర్లు వేయించనున్నట్లు తెలిపారు. మండలంలో టీడీపల్లి బీసీ కాలనీ, జిల్లేడగుంట, గుర్రప్పకొండ ఎగువ తండా, గోవిందాపురం ఎస్సీ కాలనీలకు కొత్త బోర్లు మంజూరైనాయి రెండు రోజులు వాటిని వేస్తాం.